
# రామభద్రం చాలా మంచోడు




**ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కన్నాజీరావుగారి పెద్దమ్మాయి ఒరిస్సాలో ఉన్న పడదీప్‌లో ఉంటుంది. ఆమెకి ఒకే కూతురు. పేరు సత్యవేణి. మొన్నే నాలుగోఏడెళ్ళి అయిదొచ్చింది. సత్యవేణికి తెలుగురావడం లేదని ఇక్కడికి తీసుకొచ్చి రామచంద్రపురం కాన్వెంటులో చేర్చేరు.**

అయితే ఆ పిల్ల నెలకి ఇరవైరోజుల పాటు కాన్వెంటు కెళ్ళకండా నాగాలు పెడ్తుంది. ఆ రోజు పొద్దుటకూడా తీసుకెళ్ళడానికి రిక్షా వచ్చి అరగంటయినా పిల్ల తయారవ లేదు. ఎన్నో విధాలుగా బతిమాల్తుంది కన్నాజీరావుగారి భార్య ఆమె మాట వినని ఆ పసిది మొరాయించి మూల కూర్చుంది తప్ప లేవడం లేదు. రామభద్రం సువేగా బండాగింది.

స్టాండేసి లోపలికొచ్చిన రామభద్రం విషయం తెల్సుకుని సత్యవేణి దగ్గరకొచ్చి "బళ్ళోకీ వద్దు గిళ్ళోకీ వద్దు. నీకేం కావాలో అన్నీ కొని పెడతాను. నాతో పాటు వస్తావా? నా మోట్రు సైకిలు ముందుకూర్చోబెట్టుకు తీసుకెళ్తాను నాతో పాటు రాంపురం వస్తావా" అన్నాడు.

"సరే" అంది.

తనతో పాటు తీసుకెళ్తుంటే ఐస్‌క్రీమ్ కావాలంది సత్యవేణి. వెంటనే నేషనల్ ఐస్‌పార్లర్‌కి తీసుకెళ్ళి "భూషణంగారూ మంచి



ఐస్‌క్రీమ్ ఇవ్వండి మా పాపకి'' అన్నాడు.

ఆ తర్వాత పులిబొమ్మ కావాలంది. చౌదరీ ఎంపోరియంలోకి తీసుకెళ్ళి పులిబొమ్మతో పాటు మేక బొమ్మ, కుక్కకూడా కొనిపెట్టేసేడు.

అలా ఆ పసిపిల్ల ఏవడిగితే అది కొనిపెట్టి ''మరి ఇన్ని కొనిపెట్టిన ఈ తాతమాట వింటావా?'' అన్నాడు.

''వింటాను?'' అంది. ''ఒట్టు?'' అన్నాడు.

''ఒట్టు'' అంది. ''జాయిగా అలాగ మీ కాన్వెంటు దాకా వెళ్ళొద్దామా?'' అన్నాడు.

''అరుణామిస్సు కొడ్తుంది''.

''మా పాపని కొట్టడానికి నువ్వెవరవని నిలదీసి నేనడుగుతాను గందా...'' అని తీసుకెళ్ళేడు. కాన్వెంటులో ఆ పసిపిల్లల్తో కల్సిపోయి ఆడ్తున్న రామభద్రం కేసి విస్తుపోయి చూస్తున్న టీచర్లు అసలు ఇతని వయసేంటి ఆ పిల్లల వయసేంటి అనుకున్నారు.

అలా ఆరోజు కాన్వెంటుకెళ్ళిన కన్నాజీరావుగారి

మనవరాలు సత్యవేణి ఇక ఏరోజూ మానకండా వెళ్తానే ఉంది.

అప్పుడప్పుడు ఆ పిల్లకి బంతులూ బొమ్మలూ కొని పట్టుకెళతానే ఉన్నాడు రామభద్రం.

* * *

లాకుల దగ్గరున్న చింత చెట్లకింద పెద్ద పెద్ద సిమ్మెంటు తూములు గజిబిజిగా పడున్నాయి. తక్కినోళ్ళతో పాటు దానిమీద కూర్చున్న కర్రోరి సుబ్బులు, బ్రాకెట్టు ఆదిరెడ్డిగారి సత్యానందం నాగేంద్రప్రసాదూ ''ఎళ్ళిన మనిషి ఇంకా రాలేదేంటా'' అని చూస్తున్నారు.

కాస్సేపటికి చంటిబాబుతో పాటొచ్చిన రామభద్రం ''ఏంటీ అర్జంటుగా రమ్మని కబురెట్టారంట?'' అన్నాడు.

''రేపు కాకినాడ కల్పనా దియేటర్లో మన ఎన్టీవోడి కొత్తబొమ్మ కోడలు దిద్దిన కాపురం రిలీజు. తెల్లవారు ఝామునే క్యూలోకెళ్ళిపోయి కౌంటరు తీసినెంటనే మొదటిటిక్కెట్టు మనం లాక్కోవాలి. కుర్రోళ్ళవంతా కల్సి తలో పదీ ఏసుకుని బయల్దేరుతున్నాం, నువ్వుకూడా వస్తానంటే చెప్పు'' అన్నాడు బ్రాకెట్టు ఆదిరెడ్డిగారి సత్యానందం.

''చెప్పడం ఏంటి వెంటనే లాగించేద్దాం...ఏదీ ముందో సిగిరెట్టిలా పడెయ్యండి'' అంటా ఆ కుర్రకారు మధ్యలో చతికిల బడిపోయేడు రామభద్రం.

రాత్రికి రాత్రే కాకినాడెళ్ళేక కల్పనా దియేటరుకెళ్ళి కుర్రోళ్ళందరి కంటే ముందు క్యూలో కూర్చున్నాడు రామభద్రం. అతని వెనక తక్కినవాళ్ళు.

ఎప్పటికో తెల్లవారింది.

ఆ తర్వాత ఎప్పుడో మార్నింగ్‌షోకి కౌంటరు తెరిచేరు. తనతో వచ్చిన పదిమంది కుర్రోళ్ళకీ తనే బాల్కనీ టిక్కెట్లుకొని లోపలికి పరుగెట్టేడు.

హాల్లోకెళ్ళి తన అభిమాన నటుడు ఎన్టీవోడు వెండితెరమీదకి వచ్చినపుడు అందరితో పాటే పూలు డబ్బులూ తెరమీదికి విసిరేసి అరవడం మొదలెట్టేడు. సినేమా అయ్యాకా హండ్రెడ్ డేసు బొమ్మ అని అందరితో పాటు అరుచుకుంటూ వస్తున్న రామభద్రాన్ని చూసిన కొందరు ''ఇతనేంటి ఇతని వయసేంటి అరవయ్యేళ్ళమనిషి ఆ కుర్రకారుతో ఆ గంతులేంటి?'' అనుకున్నారు.

''ఓల్గా హొటల్లో టిఫిన్లు చేస్తున్నప్పుడు పాటలు భలేగున్నాయి కదా?'' అన్నాడు నాగేంద్రప్రసాదు.

''ఘంటసాలోడి స్టోను కొత్తగా ఉందీ సినేమాలో'' అన్నాడు రామభద్రం.

సముద్ర పొడ్డుకెళ్ళి దూరంగా ఆగున్న ఓడల్ని చూసేరు. మసీదు సెంటర్లో మిఠాయి కిళ్ళీలు తిన్నారు. మీసాలరాజు మిలట్రీ హొటల్లో వేటమాంసం పలావు తిన్నారు.

''బస్టాండుకెళ్ళి మనూరి వేపెళ్ళే బస్సు ఎక్కేద్దామా? ... లేకపోతే బుడంపేటలో అమ్మాయిల దగ్గర కెళ్దామా?'' అనడిగేడు రామభద్రం.

''బుడంపేట వెళ్దాం'' అన్నాడు కోడిజుట్టు రాము.

ఆ కుర్రాళ్ళందరికంటే ముందు పరిగెడ్తున్న అరవయ్యేళ్ళ రామభద్రాన్ని విచిత్రంగా చూస్తున్నారు రిక్షావాళ్ళు.

ఖర్చు చాలా అయ్యింది అంతా రామభద్రమే పెట్టుకున్నాడు.

ఇక అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకుని బస్సెక్కి పసలపూడి ఊళ్ళో దిగేసరికి కోడి కూసేసింది అప్పుడే తెరిచిన గోపాత్రావు హొటేల్లో

నురగ ఎక్కు వేయించుకుని స్ట్రాంగ్ టీలు తాగి కాళ్ళీడ్చుకుంటూ ఇళ్ళ కెళ్ళిపోయారు.

* * *

రామచంద్రపురం కిషోర్ టాకీసు జంక్షన్‌లో ఉన్న వీరభద్రా ప్రింటింగ్ ప్రెస్‌కి ఓనరు రామభద్రం. కాలితో తొక్కే ట్రెడిల్ మిషన్ మీద చిన్న తరహా వాళ్ళ శుభలేఖలు, కార్డులూ, రేషన్ కార్డులూ ముఖ్యంగా వూళ్ళో నాలుగు సినిమాహాళ్ళ టిక్కెట్లూ ప్రింట్ చేస్తుంటాడు. ఈ ప్రెస్సే గాకండా వడ్డీ వ్యాపారంకూడా ఉంది రామభద్రానికి. రాతకోతలంటూ ఉండవు ఎవడొచ్చినా డబ్బిస్తాడు. ముప్పావలా మహా ఎక్కువైతే రూపాయికి మించి తీసుకోడు వడ్డీ.

ఇంజరం నించి వచ్చిన రామభద్రం బావమర్ది రత్నేశ్వర్రావూ, తాళ్ళరేవులో ఫొటో స్టూడియో పెట్టుకున్న పిన్నికొడుకు బాబూరావూ చుట్టం చూపుకొచ్చేరు. రాత్రి డాబా మీద రామభద్రంతో పాటు సారా తాగుతున్నప్పుడు రత్నేశ్వర్రావు అడిగేడు "ఏంటి బావా యాపారాలు ఎలా సాగుతున్నాయి?" అని.

"సాగడం అంటే బావా నలుగురికీ ఉపయోగపడ్తున్నాం అదే తృప్తి"అన్నాడు రామభద్రం.

"యాపారాలు చాన్నాళ్ళనించి చేస్తున్నావు గదా అన్నయ్యా ఏమాత్రం వెనకేసేవో?" అడిగేడు బాబూరావు.

"తగులూ లేదు మిగులూ లేదు రా" అన్నాడు రామభద్రం.

"ఆడినోటమ్మటా ఈడి నోటమ్మటా వింటన్నాం... పైసా దాయవట. కనబడినోడికి ఎదురడిగి మరీ దానం చేస్తావట. అవతలోడు ఏ వయసులో ఉంటే నువ్వా వయసులో మనిషిగా మారిపోయి ఆళ్ళతో పాటు గంతు లేస్తుంటావట డబ్బులు నీళ్ళ కన్నా అద్వాన్నంగా ఖర్చు పెట్టేస్తుంటావట. ఇది ధర్మమా బావా?" అడిగేడు రత్నేశ్వర్రావు.

"అవును రోజులన్నీ ఒకేలాగుండవు. రేపొద్దున్న మనకి ఏకాలో చెయ్యో పడిపోతే పలకరించడానికి ఒక్కడంటే ఒక్కడు రాడు. కాబట్టి మన జాగ్రత్తలో మనం ఉండాలి అన్నయ్యా" అన్నాడు బాబూరావు.

"నీకూ పిల్లలున్నారు వాళ్ళకోసం రూపాయో పాపాయో వెనకెయ్యాలిబావా" అన్నాడు రత్నేశ్వర్రావు.

"అలాగే రేపట్నుంచి అలాగే చేద్దాం అనేసి చందమామలాగ నవ్వేసిన రామభద్రం నాకింకా చాల్లేదు మందు పొయ్యండెహె" అన్నాడు.

మందు కార్యక్రమం జరుగుతున్నంత సేపూ రామభద్రం దగ్గర కూర్చున్న వాళ్ళిద్దరూ ఎడా పెడా వాయిస్తానే ఉన్నారు.

* * *

వెదురుపాక వెళ్ళే దార్లో ఉన్న సర్వాయతోటలో ఉండే మేర్నీడిసూర్రావు తాడి చెట్లెక్కి కల్లు తీస్తుంటాడు. కావిడి బద్దలాగ సన్నంగా ఉండే ఆడి వయసు ఏభైకి పైనే ఉంటది.

పెద్ద పండగ దగ్గర పడ్తుంది. కూతురుకి కొత్తగా పెళ్ళయింది. సోమేశ్వరం ఇచ్చేడు. పండక్కి అల్లుడ్ని పిలవాలి. ముగ్గురు మగపిల్లలకీ పండగ బట్టలు తియ్యాలి. చేతిలో చూస్తే అర్దణాలేదు. ఎక్కడబడితే అక్కడ అప్పులు చేసెయ్యడం వల్ల ఇప్పుడు కొత్తగా అప్పు పుట్టదు... ఎలాగ? రామచంద్రపురమెళ్ళి ప్రెస్‌లో కూర్చున్న రామభద్రం దగ్గరకెళ్ళి తన కతంతా చెప్పేడు సూర్రావు.

ఓ నిమిషం ఆలోచించిన రామభద్రం తనసువేగా వెనకాల ఎక్కించుకుని నక్కినోరి బట్టలకొట్టు దగ్గరకి తీసుకెళ్ళి "నీకెంతమంది పిల్లల్రా సూర్రావూ?" అన్నాడు. "ముగ్గురు మగోళ్ళు, ఒక ఆడపిల్లండి" చెప్పేడు సూర్రావు.

నవ్వేసిన రామభద్రం "నాకు ముగ్గురు మగపిల్లలు నీలాగ ఆడ సంతానం లేదులే. మనిద్దరికీ పెద్ద తేడా లేదురా అంటా ఏవండీ నా ఖాతాలో ఈడికీ నాకూ బట్టలు చింపండి" అన్నాడు. వాళ్ళు సూర్రావుకి నచ్చిన బట్టలన్నీ చింపి ఇచ్చేరు. చివర్లో ఓ అయిదొందలు వాడి కాకినిక్కరు జేబులో పెట్టి "చూడొరే సూర్రావూ మనిద్దరం ఒక వయసోళ్ళం. మన లాంటోళ్ళకి ఇలాంటి ఇబ్బందులు తప్పవు.

వెళ్ళు సంకురాత్తిరికి అల్లుడ్ని పిలు. పండగరోజులు ఆనందంగా గడపండి... ఈ డబ్బులు నీకు కలిగినప్పుడియ్యి నాకు'' అని పంపించేసేడు.

* * *

పోతంశెట్టి గనిరాజు అదోరకం ఇకారం మనిషి. అంతా ఔనంటే తను కాదంటాడు. అంతా ఇదీ అంటే తను అది అంటాడు. అంతా పంచె జారిందీ అంటే తను ప్రాణం పోయింది అంటాడు. అలాంటి గనిరాజు రెండురోజుల క్రితం కొడుకుల్తో గొడవపడి గోపాలస్వామి అరుగుమీద పడుకున్నాడు.

ముమ్మిడివరపుకోటయ్యగారి చిట్టి వెళ్ళి ''అన్నం తిని రెండ్రోజులైంది. మా ఇంట్లో కాస్త ఎంగిలి పడుదుగాని రా గనిరాజు తాతా'' అంటే, ''మూడెకరాల నాలుగు కుంచాల పొలం నాకుండగా ఇంకొకళ్ళింట్లో తినాల్సిన ఖర్మ నాకేంటి'' అని గసిరేడు గనిరాజు.

గనిరాజు తత్వం మొత్తం తెల్సిన రామభద్రం. ఆ ముసలోడి దగ్గరకెళ్ళి పలకరించి ఆ మాటా ఈ మాటా చెప్పేక ''ఇవేళ ఇంట్లో పెద్ద గొడవైంది గనిరాజు తాతా..బాగా ఆకలేస్తుంది నువ్వు తోడొస్తానంటే రాంపురం వెళదాం'' అన్నాడు.

''మీ ఇంట్లో గొడవపడ్డట్టు నేనుకూడా మా ఇంట్లో పడ్డాను... ఎంత ఆకలిమీదున్నావో ఏంటో సరే పద'' అని లేచిన పోతంశెట్టి గనిరాజుని తనసువేగా వెనకాల కూర్చోబెట్టుకుని కాస్సేపయ్యాకా ఈ మూడ్రోజులనించీ ఎవరికీ చెప్పని కొడుకులతో గొడవ విషయం రామభద్రంతో చెప్పిన గనిరాజుని వాళ్ళింటికి తీసుకెళ్ళి కొడుకుల్ని మందలించి లోపలికి సాగనంపేడు రామభద్రం.

* * *

ముక్కోటి ఏకాదశి రోజు మరణించేడు రామభద్రం. ఆ వార్త విన్న ఊరు ఊరంతా వచ్చేసింది రామభద్రం ఇంటికి. అంతమంది జనం అంతకు ముందు మా ఏరియాలో ఎంత గొప్పోడు పోయినా రాలేదు.

వచ్చినోళ్ళకి కాఫీలూ, టీలూ ఇవ్వాలి. ఆనక శవాన్ని కాష్టానికి తీసుకెళ్ళి పండించాలి. కానీ, పైసా లేదు ఇంట్లో. రామభద్రం కొడుకు కేశవులు ఎవరి దగ్గరన్నా అప్పు చేద్దామనుకుంటుండగా అచ్యుతం బామ్మర్దయిన రత్నేశ్వర్రావూ పినతల్లి కొడుకు బాబూరావూ వచ్చి తలో రెండువేలూ సర్దేరు.

పిల్లదినం పెద్దదినం అయిపోయాకా ఆరోజు తెల్లవారింది ఊళ్ళో. సంక్రాంతి వెళ్ళిపోయినా చలింకా తగ్గలేదు. మామిడికొమ్మలు బద్ధకంగా ఊగుతున్నాయి. కొబ్బరాకులూ అలాగే ఊగుతున్నాయి. ఆడవాళ్ళు వీధి అరుగులు తుడిచి ముగ్గులు పెట్టుకుంటున్నారు. మగోళ్ళు పొలాల వేపెళ్తున్నారు. ఇంతలో ఇద్దరు మనుషులు జావా బండేసుకుని రామభద్రం ఇంటి ముందాగారు. లోపల్నుంచి వచ్చిన రామభద్రం పెద్దకొడుకు కేశవులు ''ఎవరు కావాలండీ?'' అన్నాడు.

'మేం కోటిపిల్లి నించొస్తున్నాం. ఆర్నెల్లక్రితం రామభద్రంగారు ఏ కాయితం రాయించుకోకుండా రూపాయి వడ్డీకి పాతిక వేలిచ్చేరు. ఆరు కాలం చేసేరంట గదా..అసలూ వడ్డీ కల్సి ఇదిగోండి'' అనిచ్చి వెళ్ళిపోయారు.

చల్లిపొద్దు దాటాకా సవ్వారీ బండిలో దిగిన పేకేరు సీతమ్మగారు ''మీ నాన్నగారు ముప్పావలా వడ్డీకి లక్ష రూపాయలు ఇచ్చేరు అసలూ వడ్డీ ఇదిగో బాబూ. చింపేద్దావంటే నోటు రాయలేదు మరి ఆ మనిషి నిజంగా దేవుడు నాయనా'' అని ఇచ్చి వెళ్ళిపోయిందామె.

మధ్యాన్నం రాయవరం నించి, తొస్సిపూడినించీ, బలభద్రపురం నించి. ఇటు పక్క ద్రాక్షారం, ఆదివారప్పేట, కందులపాలెం, గంగవరంనించీ వచ్చిన జనం రామభద్రం ఇచ్చిన అసలూ వడ్డీ చెల్లించి వెళ్ళిపోతున్నారు.

అలా వారంరోజుల పాటు వచ్చిన జనం డబ్బిచ్చి వెళ్తానే ఉన్నారు. ఒక్కొక్కరుగా వచ్చి డబ్బులూ ఇచ్చి వెళుతుంటే. మంచి తనానికి ఇంకా ఇంత విలువ ఉందా అని రత్నేశ్వర్రావూ బాబూరావూ మతులు పోయినట్టు చూస్తుండిపోయేరు.

* * *